డైట్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వమరవెల్లిలోని ప్రభుత్వ జిల్లా శిక్షణ సంస్థ(డైట్)లో డిప్యుటేషన్‌పై ముగ్గురు సీనియర్ లెక్చరర్లు, 8 లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో ఏ.రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్ మాత్రమే ఈ పోస్టులకు అర్హులు. నిబంధనల మేరకు ఈ నెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వచ్చే నెల 14, 15వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని డీఈవో తెలిపారు.

జిల్లాలో తీర ప్రాంత విస్తీర్ణం: 193 కిలోమీటర్లు
తీర ప్రాంత నియోజక వర్గాలు: 6
మత్స్యకార గ్రామాలు: 164
వేటపై ఆధారపడిన మత్స్యకారులు: 60 వేల మంది
వలస బతుకు సాగిస్తున్న వారు: 32 వేల మంది
ఏటా మత్స్యసంపద లావాదేవీలు: రూ.800 కోట్లు



వేటకు వెళ్లి సరిహద్దు దాటి

- మారని గంగపుత్రుల బతుకులు
- స్థానికంగా ఉపాధి లేక వలసబాట
- విదేశాల్లో నెలల తరబడి బందీలుగా..
- కుటుంబ సభ్యులకు తప్పని ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- విదేశీ కోస్టుగార్డులకు చిక్కుతున్న మత్స్యకారులు

● 2018 నవంబరు 30న ఎచ్చెర్ల మండలం కె.మత్స్యలేశం మత్స్యకారులు పాకిస్థాన్ కోస్టుగార్డులకు చిక్కారు. గుజరాత్ నుంచి అరేబియా మహా సముద్రంలో చేపలవేటకు బయలుదేరిన వీరు పాకిస్థాన్ సరిహద్దు జలాల్లోకి ప్రవేశించారు. దీంతో అక్కడి కోస్టుగార్డులు అదుపులోకి తీసుకోవడంతో జైల్లో 13 నెలలపాటు మగ్గిపోయారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అప్పటి విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ చొరవతో 2020 జనవరి 6న విడుదలయ్యారు.

● తాజాగా బుధవారం విజయనగరం జిల్లా భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన 8 మంది మత్స్యకారులు సముద్రంలో చేపలవేట సాగిస్తూ.. బంగ్లాదేశ్ సరిహద్దు జలాల్లోకి ప్రవేశించారు. అక్కడి కోస్టుగార్డు సిబ్బంది ఆ 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో మత్స్యకారులు, వారి కుటుంబాల్లో అలజడి రేగుతోంది.

రణస్థలం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు వలసబాట ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా, వారి కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నామని ప్రకటిస్తున్నా మత్స్యకారుల తలరాతలు మారడం లేదు. రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో 164 మత్స్యకార గ్రామాలున్నాయి. జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు కానీ, జెట్టీలు కానీ అందుబాటులో లేకపోవడంతో మత్స్యకారులు సంప్రదాయ రీతిలో వేటకే పరిమితమయ్యారు. ఇప్పటికీ నాటు పడవలపై ప్రమాదకర స్థితిలో వేట సాగిస్తున్నారు. స్థానికంగా వేట గిట్టుబాటు గాక జిల్లా నుంచి వేలాది మంది మత్స్యకారులు చెన్నై, గుజరాత్, ముంబాయి, పారాదీప్ వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. జిల్లాలో 60 వేల మంది మత్స్యకారులు ఉండగా.. అందులో 32వేల మంది ఉపాధి కోసం వలస బాట పట్టారంటే ఎలాంటి దుస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు. వేటలో భాగంగా విదేశీ జలాల్లోకి ప్రవేశించి అక్కడి కోస్టుగార్డులకు చిక్కుతున్నారు. ఖైదీలుగా మారుతున్నారు. వారి కోసం కుటుంబ సభ్యులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇటువంటి ఘటనలు ఎన్నో గతం లో జరిగాయి. ప్రమాదాల్లో మృత్యువాత పడిన వారు ఉన్నారు. అటువంటి విషాద సమయాల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు గుప్పిస్తున్నారు. తరువాత వాటి గురించే మరిచిపోతున్నారు. మత్స్యకారులకు సాంత్వన కలిగే శాశ్వత ప్రాజెక్టులేవీ జిల్లాలో నిర్మాణం కావడం లేదు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో మాత్రం హార్బర్లు, జెట్టీల నిర్మాణం తక్కువే. చాలా రాష్ట్రాల్లో సగటున 30 కిలోమీటర్లకు ఒక జెట్టీని నిర్మించారు. కానీ ఇక్కడ మా త్రం మచ్చుకైనా కానరావడం లేదు. టీడీపీ హయాంలో (మిగతా 6వ పేజీలో..)

స్వగ్రామాలకు క్షేమంగా తీసుకొస్తాం

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



శ్రీకాకుళం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం వలసబాట పట్టి.. బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న విజయనగరం జిల్లాకు చెందిన మత్స్యకారులను క్షేమంగా తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో ఉన్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు.. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే బాధితులను స్వగ్రామాలకు తీసుకువచ్చే చర్యలను వేగవంతం చేశారు. బుధవారం రాత్రి ఈ సమస్యపై కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో చర్చించి పరిస్థితిని వివరించారు. బంగ్లాదేశ్‌లో ఉన్న ఇండియా మిషన్, కోస్ట్‌గార్డ్‌లతో నిరంతరం ఇదే విషయమై సంప్రదింపులు చేస్తున్నట్టు వెల్లడించారు. మరోవైపు నిరంతరం అధికారులతో మాట్లాడి.. మత్స్యకారులను జాగ్రత్తగా రాష్ట్రానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పోక్సో కేసుల్లో పురోగతి సాధించాలి

- బాలికల భద్రతకే తొలి ప్రాధాన్యం
- ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందిస్తాం
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

శ్రీకాకుళం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్లలో నమోదవుతున్న ఆస్తి(ప్రాపర్టీ), పోక్సో కేసుల విచారణలో వేగవంతమైన పురోగతి సాధించాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పోలీసు అధికారులకు ఆదేశించారు. బాధితులకు తక్షణ న్యాయం అందించేలా దర్యాప్తు చేయడం, సాక్ష్యాధారాలు సమగ్రంగా సేకరించి నిందితులపై కఠినచర్యలు తీసుకోవడం ముఖ్యమని స్పష్టం చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం శ్రీకాకుళం సబ్‌డివిజన్ కార్యాలయం, టూటౌన్, ట్రాఫిక్, లావేరు పోలీసుస్టేషన్లను ఎస్పీ మహేశ్వరరెడ్డితో కలిసి డీఐజీ పరిశీలించారు. పోలీసు స్టేషన్లలో పలు రికార్డులను..పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి.. నిర్దిష్ట గడువులోగా పూర్తిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. నిందితులపై చార్జిషీట్లను దాఖలు చేయాలని తెలిపారు. సబ్‌డివిజన్ వారీగా శాంతిభద్రతల విషయాన్ని డీఎస్పీ వివేకానందను అడిగి తెలుసుకున్నారు.

● పోక్సో కేసుల్లో బంధువులే నేరస్థులుగా...

డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ.. 'ఏడాదిలో ప్రాపర్టీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. దర్యాప్తులో ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక పర్యవేక్షణ.. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలలో విద్యార్థుల కోసం బంధువులు ఎవరైనా వస్తే వారి తల్లిదండ్రులను సంప్రదించి వారి వివరాలపై యాజమాన్యం ఆరా తీయాలి. చిన్నారులపై విద్యాసంస్థలలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది అఘాయిత్యాలకు పాల్పడడం శోచనీయం. పోక్సో కేసుల్లో బంధువులే నేరస్థులుగా ఎక్కువ ఉంటున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులతో పాటు సంబంధిత విభాగాల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించి.. వారితో మమేకమవ్వాల'ని చెప్పారు.



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జట్టి, పక్కన ఎస్పీ మహేశ్వరరెడ్డి

గంజాయిపై ఉక్కుపాదం

'గంజాయి అక్రమ రవాణాతోపాటు గంజాయి తీసుకునే వారిపైనా కూడా కఠినచర్యలు తీసుకుంటాం. గంజాయి కట్టడికి డ్రోన్ సర్వైలెన్స్‌తో పాటు నిఘా వ్యవస్థ పటిష్టం చేశాం. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందించడం, ప్రతి ఫిర్యాదును న్యాయంగా పరిష్కరించడం.. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడం పోలీసు శాఖ లక్ష్యం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి. డ్రంకెన్‌డ్రైవ్, మైనర్‌డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్.. అతి వేగంగా నడిపే వాహనాల గుర్తించి కేసులు నమోదు చేయాల'ని డీఐజీ స్పష్టం చేశారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

'ఇటీవల ఫేక్ ఐడీ, ప్రొఫైల్, క్రియేట్ చేసి సామాజిక మాధ్యమం ద్వారా తప్పుడు ప్రచారాలు, వదంతులు చేస్తున్నారు. అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బు వస్తుందని ఆశ చూపించి.. అమాయక ప్రజలను సైబర్ నేరగాళ్లు పలు విధాలుగా మోసం చేస్తున్నారు. ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాల'ని డీఐజీ తెలిపారు.



అరసవల్లిలో ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్ తదితరులు

ఆదిత్యాలయాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తాం

- రథసప్తమి నాటికి పనులు పూర్తి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో ఆదిత్యాలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి అరసవల్లిలోని ఆలయ పరిసరాల్లో పర్యటించారు. ఆలయ అభివృద్ధిపై ఆదిత్యాలయ అనివెట్టి మండపంలో సమీక్ష నిర్వహించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'గతేడాది రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా, అత్యంత వైభవంగా నిర్వహించాం. ఇదే మాదిరి వచ్చే ఏడాది కూడా జనవరి 25న రథసప్తమితోపాటు సిక్కోలు ఉత్సవాలు వారం రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించాం. ఆలయ అభివృద్ధికి సంబంధించి కచ్చితమైన ప్లాన్ తయారుచేయాలి. అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ, విక్రయ కేంద్రాలు, రాజగోపురం చెడిపోకుండా ఆలయ అభివృద్ధి చేయాలి. ఇంద్రపుష్కరిణితోపాటు భక్తుల కోసం వెయిటింగ్ హాల్ నిర్మాణం, వసతి ఏర్పాట్లు, షాపింగ్ కాంప్లెక్సు, కొత్త క్యూలైన్ల ఏర్పాటు వంటి పనులు రానున్న రథసప్తమి నాటికే పూర్తి చేయాలి. సుమారు రూ.12కోట్ల (మిగతా 8వ పేజీలో..)

మళ్లీ రైతుల్లో అలజడి
● జిల్లాలో భారీ వర్షాలు ● పొలాల్లో చేరిన నీరు
● పంట చేజారుతుందని ఆందోళన
6లో

అధికారులు అప్రమత్తంగా ఉండాలి
● వర్షాల పరిస్థితిని అంచనా వేయాలి
● మంత్రి అచ్చెన్నాయుడు

మినీ స్టేడియం పూర్తయ్యేదెప్పుడో
● నత్తనడకన నిర్మాణం
● క్రీడాకారులకు తప్పని ఇబ్బందులు
6లో

శంకుస్థాపనకే పరిమితమా?
● పనులు ప్రారంభంకాని దుకాణ సముదాయం
8లో

ఆదిత్యుడి హుండీ ఆదాయం రూ.67.88 లక్షలు



హుండీల్లో నగదు లెక్కిస్తున్న దృశ్యం

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అరసవల్లి ఆదిత్యుడి దేవస్థానంలోని హుండీలను గురువారం ఆలయ అనివెట్టి మండపంలో ఈవో కె.ఎన్.డి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో తెరిచి లెక్కించారు. 82 రోజులకుగాను రూ.67,88,112 ఆదాయం సమకూరింది. ఇందులో నోట్ల రూపంలో రూ.64,34412, చిల్లర ద్వారా రూ.3,53,700 ఉన్నాయి. అలాగే బంగారం 20గ్రాములు, వెండి కేజీ 650 గ్రాములు, పది దిరహమ్‌లు, 11 రియాల్, డాలర్లు నాలుగు లభించాయి. కార్యక్రమంలో దేవదాయశాఖాధికారులు ప్రసాదరావుపట్నాయక్, ఆలయ అర్చకులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



వెన్నెలవలసలో రోడ్డుపై బైఠాయించిన గిరిజనులు

'థర్మల్' సర్వేపై గిరిజనుల ఆగ్రహం

6లో

● నవోదయ రహదారిపై బైఠాయింపు ● భారీగా పోలీసుల మోహరింపు

- డీఏతోపాటు ఇతర ప్రయోజనాలపై దృష్టి
- జిల్లాలో 24వేల మందికి లబ్ధి
- 'ఆర్టీసీ'లో పదోన్నతులు
- పోలీసు శాఖలో ఆర్జిత సెలవులు
- సర్కార్ నిర్ణయంపై హర్షం



జిల్లా ఎన్జీవో కార్యాలయం

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట

టెక్కలి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డీఏను సర్కార్ ప్రకటిస్తూ.. దీపావళి వేళ ఆయా కుటుంబాల్లో కాంతులు నింపింది. పోలీస్ శాఖ ఉద్యోగులకు ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం కూడా కల్పించింది. ఆర్టీసీ ఉద్యోగులకు సైతం పదోన్నతులు కల్పించనున్నట్టు ప్రకటించింది. దీంతో ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో సుమారు 24 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ ఇచ్చి ఉద్యోగులను మోసగించింది. కరువు భత్యం బకాయిలు ఉంచేసింది. పీఆర్సీ కమీషన్ వేయలేదు. ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదు. సమస్యల పరిష్కరించాని కోరుతూ ఆందోళన చేసిన ఉద్యోగులపై కేసులు సైతం నమోదు చేసింది. కాగా.. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా సీఎం చంద్రబాబునాయుడు ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి సారించారు. ఇటీవల పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా గ్రేడ్‌లు ఏర్పాటు చేసి.. కార్యదర్శులకు పదోన్నతులు కల్పించేలా చర్యలు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. తాజాగా డీఏ ప్రకటించారు. గతేడాది జనవరి నుంచి చెల్లించాల్సిన 3.64 శాతం చొప్పున డీఏ బకాయిలను నాలుగు విడతల్లో ఉద్యోగులకు అందజేస్తామని స్పష్టం చేశారు. దీంతో నెలకు రూ.2వేల నుంచి గరిష్ఠంగా 6వేల వరకు ఆర్థిక ప్రయోజనం దక్కనుందని ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా.. పీఆర్సీ ప్రకటన రాకపోవడంపై కొంతమంది ఉద్యోగుల్లో నిరాశ కనిపిస్తోంది. ఉద్యోగుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రభుత్వం చెబుతోంది.

ఉద్యోగ విరమణ వరకూ చైల్డ్‌కేర్ సెలవులు..

సాధారణంగా మహిళా ఉద్యోగులకు సెలవులు కీలకం. కుటుంబాల్లో మహిళల ప్రసవం నుంచి పిల్లల వివాహాలు, వారి ప్రసవాలు, అనారోగ్య, అత్యవసర సమయాల్లో సెలవులు పెట్టాల్సిన అవసరం ఉంటుంది. అలా చైల్డ్‌కేర్ సెలవులు అనేవి ఉద్యోగి సర్వీసులో 18 ఏళ్లకే ముగిసేవి. మెడికల్ లీవు కానీ.. నష్ట సెలవులు కానీ పెట్టుకోవాల్సి వచ్చేది. కాగా చైల్డ్‌కేర్ సెలవులు పెట్టుకోవడానికి ఉద్యోగ విరమణ వరకూ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. దీంతో మహిళా ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం..

దశాబ్దాలుగా ఆర్టీసీ ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. వైసీపీ సర్కారు ఆర్టీసీని (మిగతా 6వ పేజీలో..)

మళ్లీ రైతుల్లో అలజడి

• జిల్లాలో భారీ వర్షాలు • పొలాల్లో చేరిన నీరు
• పంట చేజారుతుందని ఆందోళన

నరసన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే రైతన్నలకు వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల తుఫాన్ ముప్పు తప్పిందని ఊపిరి పీల్చుకున్న రైతులు తేలికపాటి రకాల వరి పంటను కోసి.. కళ్లాల్లో ఆర బెట్టారు. కొన్నిచోట్ల నూర్పులు కూడా ప్రారంభించారు. మరికొన్నిచోట్ల పొలాల్లోనే కుప్పలు పెట్టారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో అలజడి ప్రారంభమైంది. నరసన్నపేట, సారవకోట మండలాల్లోని వివిధ గ్రామాల్లో రోడ్లపై రైతులు ధాన్యాన్ని ఆరబోశారు. వర్షం పడటంతో తడవకుండా ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. నరసన్నపేట పట్టణం, పరిసర గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది.



నరసన్నపేట: కంబకాయి జంక్షన్ వద్ద ధాన్యంపై పరదా కప్పిన రైతు సోమేశ్వరరావు



నరసన్నపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

టెక్కలిలో..

టెక్కలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గురువారం చిరుజల్లులు కురవడంతో రైతుల్లో వణుకు ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే వరిచేలు చేతికి అందే దశకు వస్తున్న తరుణంలో చిరుజల్లులతో పాటు కొద్దిపాటి గాలి తోడైనా పంట నేలకొరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జల్లులు పెద్దవైతే ఏం చేయాలో తోచడం లేదని రైతులు భీతిల్లుతున్నారు.

పోలాకిలో..

పోలాకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. పంట కోతకు వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు బెలమర, దండులక్ష్మీపురం, ప్రియాగ్రహారం, రామయ్యవలస, చెల్లాయివలస వెళ్లే రహదారులు జలమయమయ్యాయి. ఈదురు గాలులు వీస్తే తమ కష్టమంతా నేలపాలవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

• మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనంతో శ్రీకాకుళం జిల్లాలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించిందని.. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఫోన్‌లో మాట్లాడి జిల్లాలో వర్షాల పరిస్థితిపై ఆరా తీశారు. వర్షాలపై పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు అప్రమత్తంగా ఉండి... పంటలను సురక్షిత ప్రాంతాలలో భద్రపరుచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలను రైతులు పాటించాలన్నారు.

వినతుల స్వీకరణ..

నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.

వేటకు వెళ్లి.. సరిహద్దు దాటి

(ఐదో పేజీ తరువాయి)

భావనపాడులో హార్బర్ నిర్మాణానికి తలపెట్టగా దానిని మూలపేటకు మార్చారు. 2024 ఎన్నికలకు ముందు పనులు ప్రారంభించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత శరవేగంగా పనులు సాగుతున్నాయి. ఇది పూర్తయితే మత్స్యకారులకు లబ్ధి కలుగనుంది.

● కంటితుడుపు చర్యలే..

ప్రభుత్వ రాయితీలు, పథకాల విషయంలో మత్స్యకారులు కంటితుడుపు చర్యలకే పరిమితమవుతున్నారు. వేట నిషేధ సమయంలో అందించే 'మత్స్యకారుల సేవలో' పథకం కింద ఇప్పటికీ చాలామంది అర్హులకు లబ్ధి అందలేదు. వేటలో భాగంగా కంటి సంబంధిత వ్యాధులకు గురవుతున్న మత్స్యకారులకు పింఛన్లు అందిస్తామన్న ప్రభుత్వ హామీ బుట్టదాఖలైంది. సరిగ్గా వేట సాగక ఏటా వేలాది మంది మత్స్యకారులు కుటుంబాలను గ్రామాల్లో విడిచిపెట్టి సుదూర ప్రాంతాలకు వలసపోతున్నారు. స్థానికంగా ప్రత్యామ్నాయ ఉపాధి లేక కొంతమంది రహదారుల పక్కన కళ్లద్దాలు, బొమ్మలు విక్రయిస్తున్నారు. కనీసం మత్స్యకార గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కూడా జరగని దుస్థితి. పక్క గ్రామాలు, మైదాన ప్రాంతాల్లోనైనా ఉపాధి పనులు కల్పించాలని మత్స్యకారులు ఎప్పటి నుంచో కోరుతున్నా ఫలితం లేదు. కూటమి ప్రభుత్వం స్పందించి స్థానికంగా ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

● ప్రత్యేక దృష్టి..

మత్స్యకారుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. జెట్టీల నిర్మాణానికి సైతం సన్నాహాలు చేస్తోంది. వేట నిషేధ సమయంలో అర్హులందరికీ మత్స్యకార భరోసా అందించింది. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. కూటమి ప్రభుత్వం డీజిల్ రాయితీని సైతం ప్రకటించింది.

-సత్యనారాయణ,
మత్స్యశాఖ డీడీ, శ్రీకాకుళం

● వేటకు వెళ్తేనే పూట గడిచేది..

వేటకు వెళ్తేనే కుటుంబానికి పూట గడిచేది. తుఫాన్లు, వాతావరణం సరిగ్గా లేనప్పుడు రోజుల తరబడి ఇంటి వద్దే ఉండిపోతాం. కనీసం ఉపాధి పనులు ఉంటే కొంత ఇబ్బందులు తీరుతాయి. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఉపాధి పనులు పూర్తిస్థాయిలో కల్పించలేదు.

-ఎం.సత్తిరాజు,
మత్స్యకారుడు, కొవ్వాడ

● ఇబ్బందులు పడుతున్నాం..

స్థానికంగా వేట గిట్టుబాటు కాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. తప్పనిసరైతే సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. ఉన్న గ్రామాల్లో కుటుంబాలను విడిచిపెట్టి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాలో హార్బర్లు, జెట్టీల నిర్మాణం పూర్తిచేయాలి.

-ఆకుల రాముడు, చిన్నకొవ్వాడ,
మత్స్యకారుడు

మినీ స్టేడియం పూర్తయ్యేదెప్పుడో!

• నత్తనడకన నిర్మాణం • క్రీడాకారులకు తప్పని ఇబ్బందులు



నిర్మాణంలో ఉన్న మినీస్టేడియం

నరసన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులు, యువతీ యువకులు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం 2018లో నరసన్నపేటకు మినీ స్టేడియంను మంజూరు చేసింది. దీని నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఏడేళ్ల క్రితం నరసన్నపేట పట్టణంలోని నరసన్న చెరువు వద్ద అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రావడంతో కొన్నాళ్లు పనులు నిలిచిపోయాయి. ధర్మాన కృష్ణదాస్ ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్న సమయంలో మినీ స్టేడియం పనులకు మరలా అంచనాలు వేయించారు. కాంట్రాక్టర్‌ను మార్పించి... దాదాపు 80శాతం పనులు పూర్తి చేశారు. ఈ పనులకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టరు వదిలేశారు. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు, క్రీడాకారులకు నిరాశే మిగిలింది. సాధన చేయడానికి అన్ని సదుపాయాలతో మైదానాలు, ఆట స్థలాలు లేకపోవడంతో షటిల్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు జీసీ హోం, ఎమ్పీడీవో కార్యాలయం, జూనియర్, డిగ్రీ కళాశాలల మైదానాల్లో సాధన చేస్తున్నారు. అరకొర వసతుల మధ్య శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే తాము మరింత నైపుణ్యంతో అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

పనులు ఇలా..

మినీ స్టేడియం నిర్మాణానికి ఏడేళ్ల క్రితం అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి రూ.2కోట్లు కేటాయించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణాన్ని చేపట్టారు. మినీ స్టేడియంలో గ్యాలరీ, ఫ్లడ్ లైట్లు, ప్రహరీ, ఆర్చి నిర్మించాల్సి ఉంది. భవన నిర్మాణం, ఇతర పనులకు సుమారు 70శాతం వరకు నిధులు ఖర్చు చేశారు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడం వల్ల పనులు నిలిపివేశారు. ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. గ్యాలరీ, ఆర్చి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రహరీ నిర్మాణం చేపడితే మినీ స్టేడియం అందుబాటులోకి వస్తుంది. స్టేడియంలో ఫ్లోరింగ్ ఆటలకు అనువుగా లేదని, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, లైటింగ్ మార్పు చేయాల్సి ఉంటుందని క్రీడాకారులు చెబుతున్నారు. ఈ మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే షటిల్, బ్యాడ్మింటన్, వెయింట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు అనువుగా ఉంటుంది. ఇప్పటికైనా దీనిని పూర్తి చేసి... అందుబాటులోకి తీసుకురావాలని ఈ ప్రాంత క్రీడాకారులు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి..

మినీ స్టేడియాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి. వర్షాకాలంలో షటిల్ ప్రాక్టీసుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. మినీస్టేడియం పూర్తయితే పట్టణవాసుల ఆరోగ్యం మెరుగుకు ఎంతో సహకరిస్తుంది.

-డాక్టర్ గొలివి మోహన్, షటిల్ క్రీడాకారులు

ఇబ్బంది పడుతున్నారు..

పూర్తి సౌకర్యాలతో మైదానాలు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. షటిల్, బ్యాడ్మింటన్‌తోపాటు వెయింట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు మినీ స్టేడియం చాలా ఉపయుక్తంగా ఉంటుంది. స్టేడియం నిర్మాణం త్వరగా పూర్తి చేసి.. అందుబాటులోకి తెస్తే బాగుంటుంది.

-గొద్దు చిట్టిబాబు,
జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, నరసన్నపేట

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వంలో విలీనం చేసిందే తప్ప ఉద్యోగులకు ఒక్క ప్రయోజనం కల్పించలేకపోయింది. ప్రభుత్వ ఉద్యోగులని చెప్పి చాలా రకాల అలవెన్సులు నిలిపి వేసింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని నిర్ణయించారు. దీంతో చాలా మంది సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు కలగనున్నాయి.


పోలీస్ శాఖకు మరింత ఉపశమనం..

పోలీసుశాఖలో సెలవులు చాలా తక్కువ. వారాంతపు సెలవులు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. అయితే తమకు ఎర్న్, సరెండర్ లీవులు ఇవ్వాలని పోలీస్ శాఖ ఉద్యోగులు కోరుతూ వస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. నవంబరులో 50శాతం, జనవరిలో మిగిలిన 50శాతం సరెండర్ లీవుల చెల్లింపులు చేయనుంది. సరెండర్ లీవులను ఆర్జిత సెలవులుగా భావించి నగదు రూపంలో అందజేయనుంది.

ఆస్తి పన్ను మినహాయింపు..

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను నుంచి మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో ఎన్జీవో, రెవెన్యూ, విశ్రాంతి ఉద్యోగుల భవనాలకు సంబంధించి పన్ను చెల్లింపు విషయంలో ఉపశమనం కలుగనుంది.


కాస్త ఉపశమనం



గత ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ వేయటం వల్ల పోరాటం చేయాల్సి వచ్చింది. ఉద్యోగులకు ఇప్పటి వరకు నాలుగు విడతల కరువు భత్యం పెండింగ్ ఉంది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఒక డీఏ వల్ల కాస్త ఉపశమనం లభించనుంది.

-కిల్లారి నారాయణరావు, జిల్లా పీఆర్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు

పీఆర్సీ కమిషన్ వేయాలి



2023లో వేయాల్సిన పీఆర్సీ కమిషన్ ఇప్పటివరకు లేదు. దీనిపై దృష్టి సారించాలి. ఉద్యోగుల సమస్యలపై మరింత సానుకూలంగా స్పందించాలి.

-సింగుసురం వెంకటరమణరాజు,
పీఆర్టీయూ నాయకుడు

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

• విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి



తుపాకీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి

ఎచ్చెర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విశాఖపట్నం రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఓపెన్ హౌస్‌లో ప్రదర్శించిన ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, పోలీసు జాగిలాలు, బాంబులను నిర్వీర్యపరిచే పరికరాలు తదితర వాటిని విద్యార్థులకు వివరించారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే దుష్ప్రభావంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. శక్తి యాప్ సాయంతో అత్యవసర సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. మహిళా చట్టాలు, గుడ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల అనర్థాలు తదితర అంశాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ నెల 31 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో నేరాలకు అడ్డుకట్ట..

లావేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో పాటు మహిళా శిశు అభివృద్ధి, సోషల్ వెల్ఫేర్ తదితర శాఖల సహకారంతోనే నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. లావేరు పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సంరక్షకులు (మహిళా పోలీసులు) లతో ఏర్పాటు చేసిన సమావేశంలో నారీశక్తి, చిన్నపిల్లలపై లైంగిక దాడులు, మత్తుపదార్థాల నిషేధంపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా పోలీసులు బాగా పని చేసిన నాడే నేరాలను అదుపు చేయవచ్చునన్నారు. తల్లిదండ్రులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చదువుకున్న వారే మోసపోతున్నారు..

సమాజంలో డాక్టర్లు, ఇంజనీర్లు తదితర ఉన్నత విద్యావంతులే ఆన్‌లైన్ బెట్టింగులకు పోయి ఎక్కువగా మోసపోతున్నారని డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. గురువారం లావేరు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో లాభాలు చూపిస్తామని చెప్పే బోగస్ సంస్థల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత మూడేళ్లుగా లావేరు పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల శాతం బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది పనితీరు బాగుందని కితాబిచ్చారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. నారీశక్తి, సైబర్ నేరాలు, పోక్సో కేసులపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ వివేకానంద, సీఐ అవతారం, లావేరు, రణస్థలం ఎస్ఐలు జి.లక్ష్మణరావు, ఎస్ చిరంజీవి పాల్గొన్నారు.

'థర్మల్' సర్వేపై గిరిజనుల ఆగ్రహం

• రహదారిపై బైఠాయింపు
• భారీగా పోలీసుల మోహరింపు

సరుబుజ్జిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): థర్మల్ పవర్ ప్లాంట్ కోసం తలపెట్టిన సర్వే వివాదానికి కారణమైంది. వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం గేటు ముందు గురువారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో తలపెట్టిన థర్మల్ పవర్‌ప్లాంట్‌ను కొద్ది కాలం నుంచి గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు అధికారులు విడతల వారీగా డ్రోన్‌తో సర్వేలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా గురువారం కొంత మంది అధికారులు నవోదయ విద్యాలయం నుంచి డ్రోన్ కెమెరాలతో సర్వేకు ప్రయత్నించారు. దీనిని గమనించిన వెన్నెలవలస గిరిజనులు మిగిలిన గిరిజన గ్రామాల ప్రజలకు సమాచారం ఇవ్వడంతో వారందరూ నవోదయ విద్యాలయం గేటు వద్ద నిరసన చేపట్టారు. ఒక దశలో సర్వే అధికారులను బయటకు పంపించాలని గిరిజనులు నినాదాలు చేశారు. గేటును కూడా తీసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఆమదాలవలస సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దీంతో గిరిజనులు నవోదయ విద్యాలయ రహదారిపైనే బైఠాయించి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెవెన్యూ అధికారులు, గిరిజన గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి చర్చలు జరపకుండా దొంగ సర్వేలు నిర్వహించడం ఏమిటని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. నవోదయ విద్యాలయ పరిసర ప్రాంతాల్లో ఇటువంటి నిరసన కార్యక్రమాలు చేపట్టకూడదని పోలీసులు గిరిజనులకు నచ్చజెప్పినప్పటికీ వారు వినలేదు. సర్వే అధికారులను బయటకు పంపించాలని పట్టుబడుతూ...రాత్రి 9 గంటల వరకూ నిరసన కొనసాగించారు.



నవోదయ ప్రధాన గేటు వద్ద మోహరించిన పోలీసులు

బాబోయ్ కోతులు..



ఓ వీధిలో ఉన్న కోతుల గుంపు

ఇచ్ఛాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో కోతుల బెడద అధికమవుతోంది. కోతుల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావటానికి కూడా భయపడుతున్నారు. వీధులు, రోడ్లపై వానరాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో వీటి దాడిలో అనేక మంది గాయపడుతున్నారు. కోతుల బారి నుంచి కాపాడాలని ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో జలయాత్ర



జలయాత్రలో పాల్గొన్న భక్తులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి కస్పా వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆ వీధి మహిళలు జలయాత్ర చేశారు. ఇత్తడి బిందెలతో కాలి నడకన బాహుదా నదికి వెళ్లి.. అక్కడ పూజలు చేశారు. అనంతరం బిందెలతో జలయాత్ర చేపట్టారు. శుక్రవారం బాహుదా జలాలతో స్వామికి జలాభిషేకం చేస్తామని కమిటీ ప్రధాన సభ్యులు, మాజీ కౌన్సిలర్ ప్రతినిధి రెయ్యి నారాయణ తెలిపారు. వృద్ధులు కూడా ఉత్సాహంగా ఈ యాత్రలో పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల పదోన్నతుల జాబితా సిద్ధం చేయండి

● మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):సచివాలయాల ఏఎన్‌ఎంలకు సంబంధించిన పదోన్నతుల జాబితా సిద్ధంచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఏవోకు ఆదేశించారు. అన్నిజిల్లాల్లో పదోన్నతుల జాబితాలు పూర్తయినా ఇక్కడ ఇంతవరకూ సచివాలయాల ఏఎన్‌ఎంల జాబితా తయారు కాలేదని,ఈవిషయంపై డీఎంహెచ్‌వో కార్యాలయం చుట్టూ ఆరునెలలుగా తిరుగుతున్నామని గురువారం మంత్రి అచ్చెన్నాయుడిని అరసవల్లి ఆలయం వద్ద కలిసి యూనియన్ నాయకులు మురళి, సాయిప్రసాద్, పలువురు ఏఎన్‌ఎంలు వినతిపత్రం సమర్పించి వివరించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఏవోను పిలిచి మంత్రి మందలించారు. ఇప్పటికే చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఎందుకు వారి పదోన్నతుల జాబితా తయారుచేయలేదని ప్రశ్నించారు. తక్షణమే తయారుచేయాలని ఆదేశించారు.

అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆదిత్యుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఇంజినీర్ సుగుణాకరరావు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడును ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఇంటింటికి తాగునీరందించడమే లక్ష్యం: కూన



జలజీవన్‌మిషన్ పథకాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తాగునీరందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. గురువారం బూర్జలో జలజీవన్‌మిషన్ పథకం ద్వారా 97.50 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన ఇంటింటి మంచినీటి కొళాయిలు పథకాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, వి.రాంజీ, పీరుకట్ల సీతబాబు పాల్గొన్నారు.

పాత్రునివలసలో కార్డన్‌సెర్చ్

శ్రీకాకుళం రూరల్, అక్టోబ రు23 (ఆంధ్రజ్యోతి):రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత్రునివలసలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి,మద్యం, నిషేధిత పదార్థాలు, సారా, అపరిచిత వ్యక్తులను గుర్తించేందుకు తనిఖీచేశారు. ఈమేరకు అనధికార బెల్ట్‌షాపు గుర్తించి వారి నుంచి తొమ్మిది మద్యం క్వార్టర్ల సీసాలు మంగి నాగరాజు నుంచిస్వాధీనం చేసుకుని కేసునమోదుచేసినట్లు ఎస్‌ఐ కె.రాము తెలిపారు. సరైన పత్రాలులేని ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ బి.మోహిని, కానిస్టేబుల్ బి. నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

31న జాతీయ సమైక్యతా యాత్ర

ఎచ్చెర్ల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి):మాజీ ఉపప్రధాని, భారత ఐక్యతకు ఎనలేని సేవచేసిన సర్దార్ వల్లభాయి పటేల్ 150 జయంతి పురస్కరించుకుని ఈనెల 31న జాతీయ సమైక్యతా యాత్రను నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. గురువారం వర్సిటీలో సమైక్యతా యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, మేరా భారత్ జిల్లా సహాయసంచాలకులు కేవీ ఉజ్వల్, వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, ఎస్‌వో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ పాల్గొన్నారు.

ప్రత్యేక కట్టడాల విభాగం ఈఈగా గోవిందరావు

అరసవల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస ప్రత్యేక కట్టడాల విభాగం శ్రీకాకుళం జిల్లా ఈఈగా బొంగు గోవిందరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈ మేరకు గోవిందరావుకు ప్రత్యేక కటడాల విభాగం ఇంజనీరింగ్ సిబ్బంది, వివిధ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది అభినందించారు.

హైకోర్టు న్యాయమూర్తులకు ఆహ్వానం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుపోలియా న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డితోపాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గేదెల తుహిన్‌కుమార్, జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌ను గురువారం విజయవాడలో కలిశారు.శ్రీకాకుళంజిల్లాకోర్టు పాంగణంలో శనివారం జిల్లా ఏడో అదనపు న్యాయస్థానం ప్రారంభించేందుకు జిల్లాకు రానున్నారు. హైకోర్టు న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ఈశ్వరరావు, మామిడి క్రాంతి, దామోదరరావు కలిసి జిల్లా బార్ అసోసియేషన్ ఏర్పాటుచేసే కార్యక్రమంలో కూడా పాల్గొనాలని ఆహ్వానించారు.

రైల్వేస్టేషన్‌లో పనులు వేగవంతం చేయండి

ఇచ్ఛాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఖుర్దా డివిజన్ ఏసీఎం అవిక్ కుమర్ గైన్ కాంట్రాక్టర్లు, రైల్వే సిబ్బందికి సూచించారు. గురువారం ఇచ్ఛాపురం స్టేషన్‌లో జరగుతున్న పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన పనుల నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ సీబీఎస్ ఇన్‌చార్జి రమణ, సీఎంఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ వినతులను పరిష్కరించాలి

జి.సిగడాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన వినతులను పరిష్కరించాలని నియోజకవర్గ పీజీఆర్ఎస్ ప్రత్యేకాధికారి లక్ష్మణమూర్తి కోరారు.గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి. రామకృష్ణ పాల్గొన్నారు.

డీఈవో ఆదేశాల మేరకు చర్యలు

ఆమదాలవలస, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈఎస్‌ఐ బకాయిలు చెల్లించకపోవడంతో కార్మికశాఖ ఆధ్వర్యంలో ఆమదాలవలసలోని రవీంద్ర భారతి పాఠశాలను సీజ్‌చేయగా గురువారం విచారణకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీలు వేసి పాఠశాల కనిపిస్తుంది తప్ప యాజమాన్యానికి సంబంధించిన ఏ ఒక్కరు లేరని తెలిపారు. డీఈవో ఆదేశాలమేరకు పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి కార్మికశాఖకు బకాయిలు చెల్లించి ఈ ఏడాది విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా పాఠశాల తెరిపించడానికి ప్రయత్నించేందుకు వచ్చినట్లు చెప్పారు. ఈవిషయాన్ని డీఈవో దృష్టికితీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు చర్యలు చేపడతామనితెలిపారు.కార్యక్రమంలో ఎంఈవో అప్పలరాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో వనరుల దోపిడీ ఆపాలి

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో వనరుల దోపిడీ ఆపాలని అఖిల భారతవ్యవసాయ కార్మికసంఘ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ భూకబ్జాలకు వ్యతిరేకంగా జనవరి 19న దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతుసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని తెలిపారు.

ఆర్జీయూకేటీలో క్విస్కిట్ పాల్‌ఫెస్ట్

ఎచ్చెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):క్వాంటమ్ కంప్యూటింగ్‌పై జాతీయ స్థాయిలో నిరంతర పరిశోధనలు అవసరమని ఎన్ఎస్‌టీఎల్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వి.భుజంగరావు తెలిపారు. గురువారం ఎస్ఎంపురం పరిధిలోని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా ఐబీఎం క్వాంటమ్ క్విస్కిట్ పాల్‌ఫెస్ట్ -2025లో భాగంగా మూడో రోజు నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. నిరంతర పరిశోధనతోనే పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని సాధించగలమని చెప్పారు. బెంగళూర్ ఐబీఎంకు చెందిన క్వాంటమ్ ఇంజనీర్ ఎ.జనని క్వాంటమ్ గణన, నైపుణ్యాలు పెంపొందించుకోవడంపై వివరించారు. డేటా టెక్ సీఈవో జ్ఞాన్‌యల్లా మాట్లాడుతూ క్వాంటమ్ పరిశోధకులు భౌతిక శాస్త్రంలో నిపుణులు కావల్సిన అవసరం లేదన్నారు. యూనివర్సిటీ ఆఫ్ ఒవిడో (స్పెయిన్) చెందిన డాక్టర్ ఎలిసఫ్ కొంబార్రో వర్చువల్ విధానంలో క్వాంటమ్ యంత్ర అభ్యాసం,దాని అనువర్తనాలు అనే అంశంపైవివరించారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఎఫ్‌వో వాసు పాల్గొన్నారు.

మత్స్యకారులను విడిపించాలి

సోంపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో బందీలుగా ఉన్న విజయనగరం జిల్లాకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులను విడిపించాలని మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడు తమ్మారావు కోరారు. గురువారం ఎకువూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల13న పొరపాటున బంగ్లాదేశ్ సముద్రజలాల్లోకి ప్రవేశించడంతో అక్కడి నేవీ అధికారుల చేతిలో బందీలుగా మారారనితెలిపారు.ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్, టీడీపీ మండలాధ్యక్షుడు మడ్డుకుమర్ సహకారంతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఫ్యాక్స్ ద్వారా సమాచారం పంపినట్టు చెప్పారు.


నేటి నుంచి సెలవుపై వెళ్లనున్న కలెక్టర్

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్‌పుండర్క్ శుక్రవారం నుంచి వారం రోజులపాటు వ్యక్తిగత కారణాల దృష్ట్యా సెలవుపై వెళ్లనున్నారు. ఈమేరకు ఆయన స్థానంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి

ఇచ్ఛాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపరిష్కారానికి కృషి చేస్తానని మూడోసారి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులనాయుడు తెలిపారు. ఇచ్ఛాపురంలో పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు సుఖాంత్‌లిమ్మాయ్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ, ఆపస్, ఏపీటీఎఫ్ 1938, వ్యాయామ ఉపాధ్యాయసంఘం విజయోత్సవ సభ నిర్వహించాయి. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.విశ్వనాథం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహన్, జిల్లా ప్రధానకార్యదర్శి కేశవరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నగిరి శరత్‌బాబ పాల్గొన్నారు.

●కంచిలి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి):కంచిలి ప్రభుత్వ కళాశాలను ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల వసతిసమస్య, ఉద్యోగులసమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.











గంజాయితో ఐదుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కోటబొమ్మాళి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గంజాయితో ఐదుగురు వ్యక్తులు పట్టుబడినట్టు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. వాంగ్రాడ పంచాయతీ నర్సింగపల్లి-తిలారు రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిమ్మాడ జంక్షన్‌కు చెందిన పినిమింటి త్రినాథ్ బరంపురంలో ఉంటూ జీవనం సాగిస్తూ గంజాయికి, మద్యానికి బానిసయ్యాడు. దీంతో బరంపురానికి చెందిన సిగరెట్ల వ్యాపారి విజయ్ పట్నాయక్‌తో పరిచయం ఏర్పాడింది. వీరిద్దరూ గంజాయిని ఒడిశా రాష్ట్రం ఉదయగిరిలో కొనుగోలు చేసి నిమ్మాడ పరిసర ప్రాంతాల్లో గల గ్రానైట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న వారికి విక్రయించేవారు. త్రినాథ్ తన స్వగ్రామం నిమ్మాడ వచ్చినప్పుడల్లా కొంత గంజాయిని తీసుకొచ్చి బెవర శ్రీనివాసరావు, తోట వెంకట్, సాంమ్రాట్‌కి విక్రయించేవాడు. ఈ క్రమంలో త్రినాథ్‌కు వారు ఫోన్ చేయడంతో ఉదయగిరిలో 4.85 కిలోల గంజాయి గురువారం కొనుగోలు చేసి ఐదు ప్యాకెట్లుగా మార్చి నిమ్మాడ జంక్షన్ తిలారు రోడ్డుకు తీసుకుని వచ్చాడు. అక్కడ సిద్ధంగా ఉన్న వారికి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీతో వారి నుంచి గంజాయితోపాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసున్నట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను పాతపట్నం కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలిపారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

టెక్కలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెద్దసాన గ్రామానికి చెందిన మెట్ట కృష్ణారావు, సంతోష్, వైకుంఠరావుపై అదే గ్రామానికి చెందిన బొడ్డేపల్లి మోహనరావు, సింహాచలం దాడి చేసినట్టు సీఐ విజయకూమార్ తెలిపారు. నందమ్మ ఊరేగింపులో బుధవారం రాత్రి జరిగిన తగాదాలో కొట్లాట జరిగిందన్నారు. గాయపడివారిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించామని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అబుదుబాయ్‌లో వలస కూలి మృతి


విజయ్(ఫైల్)

ఇచ్ఛాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అబుదుబాయ్‌లో వలస కూలిగా పనిచేస్తున్న మండలంలోని సన్యాసిపుట్టుగకు చెందిన మాసుపత్రి విజయ్(21) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మాసుపత్రి శంకర్, లోలమ్మ ఇద్దరూ కూలిపని చేసుకుని కుటుంబాన్ని పోషించుకొనే వారు. వీరి ఇద్దరి కుమారులు బన్నీ, విజయ్ అబుదుబాయ్‌లో పనిచేస్తున్నారు. చిన్నవాడు విజయ్ ఏడు నెలల కిందటే అబుదుబాయ్‌లో వెళ్లాడు. అక్కడ ఎస్‌హెచ్‌ఎస్ కంపెనీలో కన్‌స్ట్రక్షన్ స్ట్రాచలర్ ఫిట్టర్‌గా చేరాడు. బుధవారం రాత్రి కూడా ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. గురువారం ఉదయం పెద్దకుమారుడు బన్నీ ఫోన్ చేసి తమ్ముడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడని తల్లిదండ్రులకు తెలియజేశాడు. దీంతో తల్లిదండ్రులు రోదిస్తున్నారు. మృత దేహాన్ని తెప్పించే ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, కేంద్రమంత్రి రామ్మోహన్‌ను కోరుతున్నారు.

జాతీయ రహదారిపై లారీ, ఆటో బోల్తా


బోల్తా పడిన లారీ, ఆటోను యంత్రంతో పక్కకు తీస్తున్న దృశ్యం

రణస్థలం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దన్నానపేట జాతీయ రహదారి వద్ద గురువారం లారీబోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ.. ముందువెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఈ రెండూ బోల్తా పడ్డాయి. లారీలో చిక్కుకున్న క్లీనర్‌ను స్థానికుల సహకారంతో బయటకు తీశారు. అయితే ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటన స్థలానికి జేఆర్‌పురం పోలీసులు చేరుకుని ట్రాఫిక్ క్లీయర్ చేశారు

తాకట్టు పెట్టిన బంగారం ఇప్పించండి

గార, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తాను తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వాలని బందరువానిపేటకు చెందిన మైలపల్లి పద్మశ్రీ వాడపాలెంకు చెందిన ఓ వ్యక్తి ఇంటి ముందు తన కుమారుడితో కలిసి గురువారం నిరసనకు దిగారు. తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని, ఆమె ఒక డబ్బాను చూపిస్తూ నిరసనకు దిగారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్థానిక బ్యాంకులో ఉన్న తన బంగారం విడిపించి ఎక్కువ సొమ్ము కోసం అతడి వద్ద తాకట్టు పెట్టినట్టు ఆమె వాపోతోంది. ఇప్పుడు తన బంగారం ఇమ్మంటే తాకట్టు పెట్టలేదని ఆయన పేర్కొంటున్నాడని పద్మశ్రీ చెబుతోంది.

నేలబావిలో పడిన ఆవు


మృతిచెందిన ఆవును బయటకు తీస్తున్న దృశ్యం

టెక్కలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ టెక్కలి పరిధి ఎన్టీఆర్ కాలనీలో బుధ వారం రాత్రి నేలబావిలో ఆవు పడింది. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే బావిలో పడిన ఆవును తీసేందుకు ఎన్నిరకాలుగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. చివరకు గురువారం మృతి చెందిన ఆవును జేసీబీ సాయంతో స్థానికులు బయటకు తీశారు. నిర్లక్ష్యంగా నేలబావిని వదిలేయడంతో ఈ ప్రమాదం జరిగిందని పలువురు అంటున్నారు.

వేషం వేయించి.. పాఠం బోధించి


ఆదిమ మానవుల వేషధారణలో విద్యార్థులు

మెళియాపుట్టి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెద్దపెద్మాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా బోధజన సాగుతుంది. విద్యార్థులకు అర్థమయ్యేలా సృజనాత్మ విద్యను అందిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం 6వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో ఆదిమ మానవులు జీవన విధానంపై విద్యార్థులతో వేషం వేయించి బోధించారు. ఇలా బోధించడం వల్ల విద్యార్థులు కూడా ఆసక్తిగా వింటున్నట్టు హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు శిమ్మన్న, ఈశ్వరావు తదితరులు తెలిపారు.

శంకుస్థాపనకే పరిమితమా?

- పనులు ప్రారంభంకాని దుకాణ సముదాయం
- వృథాగా రూ.4కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం


శిథిలావస్థకు చేరిన పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్
ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా ఖాళీగా ఉన్న స్థలం

కోటబొమ్మాళి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యువ వ్యాపారులకు ఉపాధి కల్పించడంతో పాటు మేజరు పంచాయతీకి ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో దుకాణ సముదాయం శంకుస్థాపనకే పరిమితం అయింది. దీంతో యువ వ్యాపారులు నిరుత్సాహ పడుతున్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ భవనం ఎదురుగా, పాత చేపల మార్కెట్ వద్ద రూ.80లక్షల వ్యయంతో దుకాణ సముదాయం (షాపింగ్ కాంప్లెక్స్) నిర్మించేందుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ ఏడాది జూన్ 28న శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనులు ప్రారంభించకపోవడంతో షాపులు కోసం ఎదురుచూస్తున్నవారికి నిరాశే మిగిలింది. కోటబొమ్మాళి మండల కేంద్రంలో చిన్న పాన్‌షాపు పెట్టుకుందామన్నా అద్దెలు వేలల్లో ఉన్నాయి. అయినా షాపులు దొరకని పరిస్థితి ఉంది. అయితే ఇక్కడ గతంలో కొంత మంది చిన్నబడ్డీకొట్లు పెట్టుకొని జీవనం సాగించేవారు. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించి షాపులు కట్టి ఇస్తామని చెప్పారు. చెప్పి సుమారు 15 ఏళ్ల గడుస్తున్నా షాపులు నిర్మించకపోవడంతో వారంతా ఆశలు వదులుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ స్థలంలో షాపులు నిర్మించి అద్దెకు ఇస్తే పంచాయతీకి ప్రతీ నెలా సుమారు రూ.3లక్షలు వరకు ఆదాయం వస్తుందని, తద్వారా పంచాయతీ అభివృద్ధికి దోహదపడుతుందని మంత్రి అచ్చెన్నాయుడు ఎంతో ఆశయంతో భవన సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో మళ్లీ ఆశవాహుల్లో ఆశకలిగింది. అయితే శంకుస్థాపన చేసి ఐదు నెలలు గడుస్తున్నా.. నేటికి పనులు ప్రారంభించకపోవడం దురదృష్టకరం. పంచాయతీకు ఆదాయం వచ్చే పనులు ప్రారం భించకపోవడం, ఈ పనులు పై పంచాయతీకి చెందిన పెద్దలు కూడా దృష్టి పెట్టకపోవడంపై స్థానికుల్లో అనుమానం వ్యక్తం అవుతుంది. ప్రధాన రహదారి ని ఆనుకొని ఉన్న రూ.కోట్ల విలువైన ఈ స్థలం ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో ఆక్రమణ దారులు కన్నుపడింది. దీంతో పెద్దలతో ఒప్పందం కుదుర్చుకొని ఆ స్థలాన్ని కాజేసేందుకు చూస్తున్నారని, అందుకే ఈ జాప్యం జరుగుతుందని పంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే పంచాయతీ కార్యాయానికి వెళ్లే రహదారిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో అటుగా వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు చూసి ఆ షాపుల్లో పనిచేస్తున్న వారితో మాట్లాడారు. ఈ షాపులు పూర్తిగా పాడైపోయాయని, మరమ్మతులు చేయాలని పంచాయతీ పెద్దలకు, అధికారులకు మంత్రి సూచించారు. కాగా షాపింగ్ కాంప్లెక్స్ జాప్యంపై పంచాయతీరాజ్ జేఈ అజిత్‌ను వివరణ కోరగా.. సంబంధిత కాంట్రాక్టర్‌ను పనులు ప్రారంభించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, మరోసారి చెప్పి అప్పటికి స్పందించకపోతే మరో కాంట్రాక్టర్‌కు అప్పగించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పార్టీ అభివృద్ధిలో కార్యకర్తలదే కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్ఎన్ పేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధిలో కార్యకర్తలదే కీలకపాత్రని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ మండల కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధ్యక్షుడిగా ఎం.మోహనరావు, ఉపాధ్యక్షుడిగా జి.గణేశ్, ప్రధాన కార్యదర్శిగా కె.చిరంజీవి, కోశాధికారిగా వి.చంద్రశేఖరరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎం.భద్రయ్య, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా కె.అన్నంనాయుడు, ఒనాం పాణిగ్రాహి, బి.మల్లేసుతో ప్రమాణస్వీకారం చేయించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో వంశధార బీఆర్ఆర్ జిల్లా నీటిసంఘం వైస్ చైర్మన్ వి.ఆనందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.మన్మథరావు, నాయకులు ఎస్.తేజేశ్వరరావు, వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే సపర్యలు

పాతపట్నం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం శ్రీకాకుళం నుంచి పాతపట్నం వైపు వస్తుండగా.. నైరా జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించారు. వెంటనే వాహనాన్ని ఆపించి గాయపడిన వ్యక్తి వద్దకు వెళ్లి సపర్యలు చేశారు. అనంతరం అతడిని ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేసి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే చూపించిన చొరవపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

విద్యార్థుల మాక్ అసెంబ్లీ


మాక్ అసెంబ్లీలో మాట్లాడుతున్న విద్యార్థి

టెక్కలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ముఖ్యమంత్రి, స్పీకర్, ఉపముఖ్యమంత్రి, పలువురు మంత్రుల పాత్రలో విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించి ఆకట్టుకున్నారు.

బాలికల సంక్షేమానికి కృషి

హరిపురం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): బాలికల సంక్షేమానికే బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఐసీడీఎస్ సీడీపీవో పి అరుణ అన్నారు. మందస మండలం రాధాక్రిష్ణపురంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థినులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి, రాజేశ్వరి, పాఠశాల, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నరసన్నపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని, ఈ దశలోనే లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని సీఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీఎఫ్‌డీసీ డైరెక్టర్‌గా చైతన్య బాధ్యతలు


బాధ్యతలు చేపడుతున్న చైతన్య

మెళియాపుట్టి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ) డైరెక్టర్‌గా గేదెల చైతన్య గురువారం మంగళగిరి లోని ఆరణ్య భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మార్గదర్శకంలో పర్యావరణ, అటవీ సంరక్షణ రంగాల్లో కొత్త దిశలో ముందుకు సాగేందుకు కృషిచేస్తానన్నారు. చైర్మన్ వెంకట సుజయ్‌కృష్ణ రంగారావు సమక్షంలో బాధ్య తలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. జనసేన ఏర్పాటు నుంచి పాతనట్నం నియోజక వర్గంలో పార్టీ బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు.

కొత్తమ్మతల్లి సన్నిధిలో విజిలెన్స్ ఎస్పీ


అమ్మవారి చిత్రపటాలు అందిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లిని విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాదరావు, సీఐ డీవీవీ సతీష్ గురువారం దర్శించుకున్నారు. వీరిచే ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ కోరాడ గోవిందరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రసాదం, ఫోటోలు అందజేశారు. కార్యక్రమం కమిటీ సభ్యులు మంచాల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వారి అమాయకత్వమే గిరిజనేతరులకు వరం

మందస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అమాయకత్వమే గిరిజనేతరులకు వరంగా మారిందని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొండలోగాం రెవెన్యూ పరిధిలో చాపరాయి కాలనీకి చెందిన గిరిజనుల భూములు గిరిజనేతరుల పేర్ల మీద నమోదు కావడంపై అధికారులను ప్రశ్నించారు. రీసర్వే చేసిన ముందు ఎవరి పేర్లు ఉన్నాయో పరిశీలించాలని, ప్రస్తుతం ఎవరి పేరుమీద గిరిజనుల భూములు ఉన్నాయో అవి తప్పుడు డాక్యుమెంట్లని, వాటిని తహశీల్దార్ పరిశీలన చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కోనేరు రమేష్, తామాడ సన్యాసిరావు, మద్దిల రామారవు, సవర నర్సింహులు సవర హరిక్రిష్ణ, గణపతి,బాధితులు కూర్మారావు, జయరాజ్, నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయిద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసిన తర్వాతే రానున్న మునిసిపల్ ఎన్నికల్లో ప్రజల వద్దకు ఓట్లు కోసం వెలదామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయంలో సింధూర జలసిరి కార్యక్రమంపై మునిసిపల్ అధికారులు, వార్డు ఇన్‌చార్జీలు, కౌన్సిలర్లతో సమీక్షించారు. సింధూర జలసిరి కార్యక్రమాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.రామారావు, ఏపీట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, దువ్వాడ శ్రీకాంత్, ఎం.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐదు కేంద్రాల్లో బయోమెట్రిక్ నమోదు

నరసన్నపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వివిధ పాఠశాల్లో చదివే విద్యార్థులు ఆధార్ అనుసంధానం చేసేందుకు ఐదు కేంద్రాల్లో బయోమెట్రిక్ నమోదు చేయడం జరుగుతుందని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడులు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ బయోమెట్రిక్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఉర్లాం, నారాయణస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ క్లారెట్, జ్ఞానజ్యోతి పాఠశాలల్లో ఆధార్ - బయోమెట్రిక్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

- జలుమూరు: విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లో చేర్పులు, మార్పులు పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో బి.చిన్నమ్మడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని గురుదవారం పరిశీలించారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ జె.సారిక, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ముందడుగు

పాతపట్నం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధికల్పనలో కూటమిప్రభుత్వం ఎల్లవేలలా ముందడుగులోనే ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. స్థానిక ఓ ప్రైవేట్ డిగ్రీకళాశాల వేదికగా ఈనెల 24న మెగాజాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తాం

(ఐదో పేజీ తరువాయి)

ఆలయ, సీజీఎఫ్ నిధులతో ఈ పనులు చేపట్టాల'ని అధికారులను ఆదేశించారు. 'షాపింగ్ కాంప్లెక్స్‌ను గుడ్‌విల్ పద్ధతిలో నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. అంచనాలు రూపొందించి టెండర్లు పిలవాలి. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఇంజినీర్‌తో ఫెస్టివల్ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయండి. ఏ సమస్య ఉన్నా సరే వెంటనే ఈ గ్రూప్ ద్వారా తెలియజేయండి' అని మంత్రి సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది అత్యవసరంగా కావాలని ఈవో అడగ్గా.. వెంటనే దేవదాయశాఖ కమిషనర్‌తో మంత్రి అచ్చెన్న ఫోన్‌లో మాట్లాడారు. రెండ్రోజుల్లో ఒక ఏఈ, డీఈల నియామక ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే దినసరి వేతన ఉద్యోగులకు ఔట్‌సోర్సింగ్ ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, ఏఎస్పీ కె.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, మునిసిపల్ ఇంజినీర్ పొగిరి సుగుణాకరరావు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించరూ..


జ్యోతి చిన్నమ్మి

హిరమండలం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని మేజర్ పంచాయతీ హిరమండలం సుభలయ కాలనీకి చెందిన జ్యోతి చిన్నమ్మి ప్రభుత్వాన్ని వేడుకుంటుంది. ఈమె వయసు సుమారు 80 ఏళ్లు ఉంటుంది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నా అనాథగానే ఉంటుంది. భర్త 10 ఏళ్ల కిందట మరణించాడు. అప్పటి నుండి ఒంటరి గానే జీవిస్తుంది. చాలాసార్లు అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నా పింఛన్ మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతుంది.

నాణ్యత, ప్రమాణాలతో మద్యం అమ్మకాలు

హిరమండలం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం దుకాణాల్లో నాణ్యత, ప్రమాణాలతో మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గురువారం స్థానిక బ్యారేజీ సెంటర్ వద్ద గల వైన్‌షాప్‌లో మద్యం అమ్మకాల తీరు, నాణ్యత, ప్రమాణాలను అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కొత్తూరు ఎక్సైజ్ సీఐ కిరణ్‌మహేశ్వరి సురక్ష యాప్ ద్వారా ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, మండల ప్రత్యేకాహ్వానితులు తూలుగు తిరుపతిరావు, కూటమి నాయకులు, ఎక్సైజ్‌శాఖాధికారులు ఉన్నారు. అలాగే సుభలయ ఆర్‌ఆర్ కాలనీ కమ్యూనిటీ భవనంలో పార్టీ మండల అధ్యక్షుడిగా దారపు డిల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సావుకారి గోవిందరావులో పాటు ఇతర సభ్యులచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు.

నువ్వలరేవు అప్రోచ్ రోడ్డుకు మోక్షం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నువ్వలరేవు అప్రోచ్ రోడ్డుకు మోక్షం లభించనుంది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నువ్వలరేవు ఉప్పుటేరు పై రూ.50 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెన నుంచి మండల కేంద్రంకు వచ్చే రహదారి అప్రోచ్ రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. తర్వాత వచ్చిన వైసీపీ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవ తీసుకోవడంతో మళ్లీ కదలిక వచ్చింది. ఈ మేరకు గురువారం తన క్యాంపు కార్యాయంలో ఎమ్మెల్యే రెవెన్యూ శాఖాధికారులతో సమీక్షించారు. నిర్వాసితుల సమస్యలు, ప్రత్యామ్నాయం, పరిహారం తదితర అంశాలను చర్చించారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో జి వెంకటేష్, వజ్రపుకొత్తూరు తహసీల్దార్ సీతారామయ్య, సర్వేయర్ తిరుపతిరావు, పీఏసీఎస్ చైర్మన్ కణితి సురేష్, నువ్వలరేవు గ్రామస్థులు ఉన్నారు.

పంచారామ క్షేత్రాల దర్శనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పలాస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పంచారామ క్షేత్రాలకు పలాస ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపిస్తున్నామని డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ నాయుడు గురువాకం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26, వచ్చే నెల 2, 9, 16 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. పంచారామ క్షేత్రాల్లో భాగంగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట వంటి క్షేత్రాలు సందర్శించడం జరుగుతుందన్నారు. సూపర్‌లగ్జరీ సర్వీస్‌కు ఒక్కొరికి రూ.2700, అల్ట్రా డీలక్స్‌కు రూ.2650 చెల్లించాలని కోరారు. ఆసక్తి గలవారు 9959225610, 9949916017 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి నిధులు

పోలాకి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి పంచాయతీ కింజరాపువానిపేట ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు ద్వారా రూ.29 లక్షలు మంజూరు చేయించినట్టు తెలిపారు. కాగా ఈ పాఠశాల పరిస్థితిపై ఇటీవల ఆ గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి వివరించారు. నిధులు మంజూరుపై మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు, పాఠశాల విద్యాకమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చెత్తసేకరణపై అవగాహన

నరసన్నపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్తసేకరణ చేసి గ్రామాల్లో పరిశుభ్రతకు బాటలు వేయాలని డీపీవో భారతీసౌజన్య సూచించారు. గురువారం జమ్ము గ్రామంలో ఇంటింటా చెత్తసేకరణపై అవగాహన నిర్వహించారు. వర్షాలు పడే సమయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యాక్రమంలో ఎంపీడీవో వెంకటేష్‌ప్రసాద్, కార్యాదర్శి కల్యాణం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

కొత్తూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం కొత్తూరులో టీడీపీ మండల కార్యవర్గం ప్రమాణస్వీకారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధ్యక్షుడిగా అగతముడి మాధవరావు, కార్యదర్శిగా అరుబోలు దశరధరావు, పలువురు సభ్యులతో ప్రమాణం సేయించారు. పార్టీ పరిశీలకులు బుద్ధా త్రినాథ్, నాయకులు అగతముడి బైరాగినాయుడు, పెద్దిన కులశేఖర్ అళ్వార్ తదితరులు పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోటి సంతకాలు సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ గురువారం వైసీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, సరియాపల్లి, దంత గ్రామాల్లో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

మెళియాపుట్టి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెద్దమడి గురుకుళ కళాశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయుడు తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో పెద్దమడి గురుకులంలో సమస్యలు తిష్ఠ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో బుధ వారం ఆర్వో ప్లాంట్ మంజూరు చేశారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించనున్నట్టు హెచ్ఎం తెలిపారు.

పుస్తకావిష్కరణ

టెక్కలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బీఎస్ అండ్ హెచ్ విభాగం ఆధ్వర్యంలో కార్తీకరాజ్ రచించిన యూనివర్సల్ హ్యూమన్ వ్యాల్యూస్ పుస్తకాన్ని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రత్నమణి, డాక్టర్ రమణయ్యలు ఉన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

సంతబొమ్మాళి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం మెట్ట రామారావు తెలిపారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనున్నట్టు తెలిపారు. అండర్-19 విభాగంలో ఎన్.హారికారెడ్డి, అండర్-17లో డి.ఖ్యాతిరెడ్డి, డి.త్రివేణి, బి.పవిత్ర, ఎన్.ఝాన్సీ ఎంపికైనట్టు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

హిరమండలం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆ పాఠశాలలో చదువుతున్న ఓ బాలికతో ఆయన అసభ్యకరంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయ సేవలపై అవగాహన



పాతపట్నం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ శ్రీకాకుళం జిల్లాకార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక సబ్ జైల్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. అలాగే ఖైదీలతో మాట్లాడుతూ వైద్యసేవలు, మెనూ అమలుపై ఆరా తీశారు. పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి, జైలు విజిటింగ్ న్యాయవాదులు సత్యానారాయణ, రామ్మోహనరావు ఉన్నారు.

పరిశ్రమ తెరిపించండి

మందస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మందసలోని జీడి పరిశ్రమను తెరిపించి ఉపాధి కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ కె.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని జీడి కార్మికులకు న్యాయం చేయాలన్నారు.